# అగ్రహారం కథలు



జగత్పతి యర్రమిల్లి



తొలిముద్రణ
సెప్టెంబర్ 2019

సర్వహక్కులు
రచయితవి

మూల్యం
వెల ₹ 200/-

*DTP*
*A Bhaskar*
*Rjy. Cell: 98485 20465*
*bhaskar465dtp@gmail.com*

*Back Cover Designed by:*
*Baby Aanya Rangachari*
*Fremont, California, USA.*

కాపీలకు:
**జగత్పతి యర్రమిల్లి**
రాజమహేంద్రవరం
e-mail ID: yjagatpati@gmail.com

# విషయసూచిక


1. నాన్న అంతరంగం
2. మా తుర్ఖు సలాం
3. శ్రీ వేంకటాచల వైభవం
4. కాలం మింగేసిన బాల్యం
5. ఆకుపచ్చని జ్ఞాపకాలు
6. భాద్రపద మాసే
7. వెన్నెల్లో హాయ్... హాయ్...
8. సిత్రం శివుడో...
9. తొలకరి తుళ్ళింత
10. అమావాస్య వెన్నెల
11. ఎరుపు అంచు నీలం రంగు జరీచీర
12. రాజు గారి ట్రంకు పెట్టె
13. అందరికీ ఆరోగ్యం
14. శచీదేవి... ఓ జ్ఞాపకం
15. దుబ్బా... దుబ్బా... దీపావళి
16. పాపాకో కుష్ కరో
17. బాలల దినోత్సవం
18. పారిజాతం
19. రాధా రమణీయం

20. మరుగేలరా! ఓ రాఘవా!

21, గుండెల్లో గోదారి

22. స్వామి రా! రా!

23. సైకిల్ వీరులు

24. స్నేహమేరా! జీవితం

25. కాళీ మనోహరం

26. నేటి జటాయువులు

27. కంచికి చేరిన కథ

28. జాతస్య హి ధృవో మృత్యుః ధృవం

29. మనం మనం బరంపురం

30. చిగురులు తొడిగిన జీవితం

31. పెద్దమ్మ

32. అమ్మ దీవెన

33. నాన్నకు వందనం

34. My Father's Son



# 1. నాన్న అంతరంగం

నాన్న వయసు డెబ్బైనాలుగు వసంతాలు దాటినపుడు జరిగిందీ సంఘటన.

అమ్మకి హార్ట్ఎటాక్ రావటంతో రాజమండ్రిలో అత్యవసర వైద్యంచేయించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ప్రయాణం పెట్టుకున్నాం నేను, సీత, నాన్న, అమ్మానూ. మరో రెండు రోజుల్లో ప్రయాణం అనగా "మన వూరు ఒంటిమామిడి అగ్రహారం వెళ్లి వస్తానురా అబ్బాయ్" అన్నాడు నాన్న.

అగ్రహారంలో తూర్పుదిక్కున ఆమడ దూరంలో పెద్దశివాలయం, కూతవేటు దూరంలో చిన్న శివాలయం ఉన్నాయి. పల్లెటూరు కావటంవల్ల నిత్యావసర సరకులకి, వైద్యానికి, ఆఖరికి ఏ చిన్నవస్తువు కావాలన్నా దగ్గరలో వున్న తుని లేకపోతే కాకినాడపట్నం పోయి తెచ్చుకోవలసిందే. నాన్న కనీసం పదిరోజుల కోసారి పట్నం ప్రయాణం పెట్టుకొనేవాడు. బయలుదేరే ముందు ఇంట్లో పెద్దల ఫొటోలకి, తూర్పుదిక్కు శివాలయాలకి ఇంటి నుండే దండాలు పెట్టుకొనేవాడు. ఈ ప్రక్రియ చాలాసార్లే జరిగేది. ఇంట్లోకి వెళ్ళడం, పెద్దల ఫొటోలకి దండాలు పెట్టడం, వీధిలోకిరావడం శివాలయాలకి నమస్కారాలు చెయ్యడమూను. ఇది ఎంతకీ తెమిలేది కాదు. ఇటువంటి సందర్భాల్లో "ఇక చాలు మీ దండాలు. అవతల బాటలో బస్సు వచ్చి వెళ్ళిపోతుంది" అనేది అమ్మ. అప్పుడు హడావుడిగా వెళ్ళేవాడు. ఒక్కోసారి బస్సు వచ్చి వెళ్ళిపోయేది కూడా.

పైకి గంభీరంగా కనిపించినా అమ్మ ఆరోగ్యం విషయంలో నాన్న ఆందోళనలో ఉన్నాడన్న సంగతి అందరికీ తెలుస్తూనే ఉంది. ఓరోజు హాస్పిటల్లో "అమ్మ లేకపోతే ఎలారా అబ్బాయి! ముందుముందు. నాకు కాఫీ కలుపుకోవడం కూడా రాదు. కాఫీ సంగతి సరే. గ్యాస్ పొయ్యి వెలిగించడం రాదే." అన్నాడు నాతో.

నాన్న ఈ సమయంలో ఒంటిమామిడి అగ్రహారం ఒక్కడూ వెళ్ళటం నాకు సుతరామూ ఇష్టంలేదు "ఇప్పుడెందుకు నాన్నా! హైదరాబాద్ నుంచి వచ్చాకా ఇద్దరం వెళ్దాంలే." అన్నా.

"ఒకసారి ఇల్లు చూసుకొని వస్తారా" అన్నాడు.

నాన్న దండాల సెంటిమెంట్ నాకు అప్పుడు ఎందుకో వెంటనే తోచలేదు. అమ్మ అనారోగ్యంవల్ల నా మనసంతా అల్లకల్లోలంగా ఉంది. అమ్మని నిర్లక్ష్యం చేస్తున్నాడన్న భావనతో ఎన్నడూలేనిది ఆరోజు నాన్నతో దురుసుగా ప్రవర్తించాను. నేను నాన్నతో దురుసుగా ప్రవర్తించడము అదే మొదటిసారి చివరాఖరిసారి కూడా. నాన్న ఏమీ మాట్లాడలేదు. తెల్లవారుతూనే మా అగ్రహారం వెళ్ళిపోయాడు. నాన్న వెళ్ళిన తరువాత నేను ఎంత దురుసుగా మాట్లాడానో అర్థమయ్యింది. మధ్యాహ్నం లంచ్‌కి డైనింగ్‌టేబుల్ దగ్గర అమ్మ, సీత, నేను మౌనంగా కూర్చున్నాం నాన్న లేకుండా. జరిగిన సంఘటన అందరి మనస్సూ తీవ్రంగానే గాయపరిచింది. ఓ నాలుగు మెతుకులు కతికి డైనింగ్ టేబుల్ వద్ద నుంచి లేచిపోయి ఎవరి గదుల్లోకి వాళ్లం వెళ్ళిపోయాం మౌనంగా. ఆ రాత్రి కూడా అలాగే గడచిపోయింది. మరునాడు ఉదయం లేవగానే ఒక నిర్ణయానికి వచ్చాను. అగ్రహారంవెళ్లి నాన్నని తీసుకురావాలని. సీతకి విషయం చెప్పి వెంటనే ప్రయాణమయ్యా. రైల్వేస్టేషన్‌కి వెళితే విశాఖపట్నం వెళ్ళే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు సిద్ధంగా ఉంది.

అన్నవరం చేరేసరికి సాయంత్రం నాలుగు గంటలైంది. స్టేషన్‌బయటికి వచ్చి చూస్తే అగ్రహారం వెళ్ళడానికి ఒక్క రిక్షాకూడా దొరకలేదు. కాలినడకన ఇంటికి బయలుదేరా. అన్నవరం నుంచి మా ఇల్లు పది కిలోమీటర్లు దూరం.



# 4. కాలం మింగేసిన బాల్యం

మనిషి జీవితంలో బాల్యం అపూర్వమైన ఘట్టం. తెలియకుండా గడిచిపోతుంది అందమైన, కల్లాకపటం, చింతాచీకూ ఎరగని అమాయక బాల్యం. 'నా బాల్యం నాకిచ్చేయి!' అని ప్రతిరోజు ఉదయం ఆ సర్వేశ్వరుని ప్రార్థిస్తూనే ఉన్నాను. అంత మధుర మైనది నా బాల్యం. దాన్ని అంత అందంగా తీర్చిదిద్దిన ఎందరో మహాను భావుల గురించి ముందు ముందు చెప్తాను.

ఒక కవిగారు అన్నట్లు ...
"కావాలనుకొన్న బాల్యం కాలం మింగేసింది
వద్దనుకొన్న ముదిమి మీద పడిపోతోంది
ఈ మధ్య కాలంలో జీవితమంతా అస్తవ్యస్తం."

## THE BEGINING

ముందుగా నా మూలాలు (Roots) గురించి ప్రస్తావించడం అవసరం గనుక వాటిని తెలియచేస్తున్నాను.

మాది తూర్పు గోదావరి జిల్లా ఒంటిమామిడి అగ్రహారం. మా పూర్వీకులు సుమారు రెండు వందల సంవత్సరాల క్రితం గోదావరీ తీరం

పాశర్లపూడిలంక నుండి దైవనిర్దేశంవల్ల ఒంటిమామిడి గ్రామానికి వలస వచ్చి స్థిరపడటం జరిగింది. అలా ఒంటిమామిడిలో స్థిరపడిన మా వంశ మూలపురుషులు యర్రమిల్లి వేంకటాచలంగారు. వేంకటాచలంగారు వేద పండితులు. శివారాధకులు. వేదాల్లో చెప్పబడినది ప్రామాణికంగా తీసుకొని, సనాతనధర్మాన్ని పాటించి బ్రాహ్మణ్య విధులను సర్వకాల సర్వ పరిస్థితుల లోనూ నిర్వర్తించి జీవించిన మహానుభావుడు. ఆరువేల నియోగి. వేంకటా చలంగారు తాను నమ్మిన జీవనసూత్రాన్నే తన సంతానానికి నేర్పారు. వెంకటాచలంగారి కాలంలో ఒంటిమామిడి బ్రాహ్మణ అగ్రహారం బ్రహ్మీ ముహూర్తంలో వేదమంత్రాలు, వేదఘోషతో మార్మోగిపోయేదని పెద్దలు నా చిన్నప్పుడు చెప్పుకొనేవారు.

వేంకటాచలం గారి నాల్గవ కుమారుడు నా ప్రపితామహ (ముత్తాత) రామచంద్రుడుగారు. రామచంద్రుడుగారి భార్య కామేశ్వరమ్మ (ముత్తబామ్మ). వీరికి పదిమంది సంతానం. ఏడుగురు కుమారులు. ముగ్గురు కుమార్తెలు (సుందరమ్మ, శరభమ్మ, సూరమ్మ). కుమార్తెలు ముగ్గిరికీ వివాహం జరిపించి తనకు తండ్రిగారినుండి అనువంశీకంగా సంక్రమించిన రెండువేల ఎకరాల పైచిలుకు స్థిరాస్తిని కుమారులకు, మరియు స్త్రీ ధనంగా తన వాటాగా మినహాయించుకున్న భూమిని వివాహితులైన కుమార్తెలకు తన జీవిత కాలంలో, అనగా 1911వ సం॥ంలో పంచిపెట్టారు రామచంద్రుడుగారు.

అదేకాలంలో ఎకరా విస్తీర్ణంగల స్తలంలో నిర్మించుకున్న పెద్దమండువా ఇల్లు కూడా రామచంద్రుడుగారు పంచారు. ఆ పంపకాల ప్రకారం ఆ పెంకుటిల్లు రామచంద్రుడుగారి ఏడుగురు కుమారులలో నలుగురికి (సర్వశ్రీ వెంకటాచలం, జగత్పతి, సూర్యనారాయణమూర్తి మరియు నరసింహంగార్లకు) సంక్రమించింది. మిగతా కుమారులకు వారు కోరిన విధంగా ఇళ్లునిర్మించి ఇచ్చారు. ఆవిధంగా రెండవ కుమారుడైన జగన్నాథ రావుగారికి ఒంటిమామిడిలోనూ, ఆఖరి కుమారుడైన మంగయ్యగారికి పాయకరావు పేటలోనూ గృహములు నిర్మించబడ్డాయి. తన బాధ్యతలు తీర్చుకున్న రామచంద్రుడుగారు విశ్రాంతి తీసుకున్నారు.



# 6. భాద్రపద మాసే

శ్రావణ మాసం వచ్చిందీ అంటే తెలుగునాట పండగల హడావుడి మొదలు. పట్టుచీరల రెపరెపలు అప్పుడే లంగా ఓణీలు వేసుకొని జడగంటలు అలంకరించుకొన్న జడలు ఎలా ఊగుతున్నాయో వెనకెనక్కి అస్తమానం చూసుకునే బామ్మ (బాపు బొమ్మ)ల హడావుడీ, పేరంటాలూ వాయినాలూ, మంగళగౌరీ వ్రతాలూ, మోచేతులవరకు అలంకరించుకొన్న గాజులతో పాటు తోరంకట్టుకొన్న లక్ష్మీ సౌభాగ్యవతులూ... ఓహో... అంతా సందడే సందడి. భాద్రపదమాసంలో వినాయకచవితితో పండగవాతావరణం ఊపు అందుకుంటుంది. దేవీనవరాత్రులు, దీపావళి, సంకురాతిరి పండగలతో వాతావరణం పరాకాష్ఠకి చేరుతుంది.

అగ్రహారంలో యర్రమిల్లి సుబ్బారాయుడుగారు ధ్యానం, వేదపారాయణం ముగించుకొని పర్ణశాలలాంటి తాటాకుపాకలో విశ్రాంతి తీసుకుంటూ ఉండగా, చిలికిన మజ్జిగ గళాసు నిండా అందించింది సుబ్బమ్మ గారు. అప్పుడే కొత్తగా నేసిన పాక మూలాన తాటియాకుల పచ్చివాసన అదోవిధమైన పరిమళం నింపుతోంది గాలివాటున.

సుబ్బమ్మగారి అప్పగారు లక్ష్మీనరసమ్మ. అగ్రహారంలో సుబ్బారాయుడుగారి ఇంటికి అసింటా తూర్పున దక్షిణముఖద్వారంగల మండువాలోగిలి లక్ష్మీనరసమ్మ

గారి భర్త జగత్పతి గారిది. సుబ్బమ్మ, లక్ష్మీనరసమ్మ గారికి స్వయానా చెల్లెలు. సుబ్బారాయుడిగారి తండ్రి సహోదరుని కుమారుడు జగత్పతిగారు. జగత్పతి, లక్ష్మీనరసమ్మగార్లకు పదహారు సంవత్సరాల కాలం తర్వాత కలిగిన మూడవ సంతానం చంద్రుడుగారు. మా నాన్న.

చంద్రుడు గారిని ఊర్లో అందరూ "చిన చంద్రుడు" అంటారు. తునిలో కాపురం పెట్టుకొని స్థిరపడిన యర్రమిల్లి జగన్నాథరావు గారి అబ్బాయి పేరూ చంద్రుడే కనుక ఆయన్ని "పెద చంద్రుడు"లేక "తుని చంద్రుడు" అని పిలిచే వారు బంధువర్గం. చినచంద్రుడు గారిని బి.కాం.చంద్రుడు అని కూడా చదూకున్న వారు వ్యవహరించడం ఆ తర్వాత ప్రాచుర్యంలోకి వచ్చింది.

అల్లం, మిరియం, కరివేపాకు వగైరాలతో కలిపి సుబ్బమ్మగారు ఇచ్చిన తేటమజ్జిగ సుబ్బారాయుడుగారు ఆస్వాదిస్తున్న ఆ సమయంలో కర్రకి కట్టిన గజ్జెలు చప్పుడుచేస్తూ ముంగిట నిలుచున్నాడు వార్తాహరుడు. ఈకాలం మాటలో చెప్పాలంటే "కొరియర్". రొంటిన ఉన్న చీటీ సుబ్బారాయుడుగారికి అందించాడు వచ్చిన వార్తాహరుడు. అది చూసి అతనికి అర్ధణా బహుమతిగా ఇచ్చి పంపించారు సుబ్బారాయుడు.

సుబ్బారాయుడుగారికి కుటుంబంలో సంభవించిన శుభకార్యాలు, శుభ వేళలు, శుభవార్తలు, వంశస్తుల జనన వివరాలు చిట్టా పుస్తకంలో నమోదు చేసుకోవటం ఎప్పటినుంచో ఉన్న అలవాటు. వార్తాహరుడు అందించిన చీటి చూసుకొని సుబ్బమ్మగారికి అందులోని శుభవార్త తెలిపి తన చిట్టా పుస్తకంలో వివరం వ్రాసుకున్నారు ఇలా. "స్వస్తిశ్రీ విక్రమ నామ సంవత్సరం భాద్రపద బహుళ షష్ఠి సోమవారం ది. 23.9.1940 సంవత్సరం మధ్యాహ్నం ఒంటి గంట యాభై ఐదు నిమిషాలకు రోహిణి నక్షత్రమున జగత్పతి గారి కుమారుడు రామచంద్రరావుకు బరంపురంలో పుత్ర జననం. చిరాయుస్తూ. శ్రీశ్రీశ్రీ". సదరు జాతకుడు అయిన నాకు 65 సంవత్సరాల తర్వాత ఈ చిట్టా అనూహ్యంగా లభించింది. ఇది ఉపోద్ఘాతం.



# 10. అమావాస్య వెన్నెల

మొన్నా ఆ మధ్యన ఓ మిత్రుడు "వృద్ధాప్యానికి ఆహ్వానం" అన్న పోస్ట్ షేర్ చేశారు. ఆద్యంతం చదివిన తర్వాత ఆశ్చర్యపోయాను. వృద్ధాప్యం ఒక వరం అని తెలుసుకొని. వ్యాసం వ్రాసిన మహానుభావులు ముందుగా ఎవరో తెలియలేదు గానీ ఆ తర్వాత తెలిసింది. ప్రముఖ రచయిత శ్రీ గొల్లపూడి మారుతీరావు గారని.

యజుర్వేదంలోని శ్రీరుద్రంలో ఒక భాగంలో "వృద్ధం చమే, వృద్ధిశ్చమే" అన్న కోరికను విశ్లేషిస్తూ వృద్ధాప్యం ఒక అవకాశం. వెనక్కి తిరిగి చూసుకుని చేసిన తప్పిదాలకు నవ్వుకుని, దాటిన అడ్డంకులను పరామర్శించి, ఇక దాట నక్కరలేని స్థితికి వచ్చినందుకు ప్రశాంతంగా నిట్టూర్చే ఆటవిడుపు అంటారు రచయిత. ఇదే వ్యాసంలో మరోచోట... నిన్నటి జ్ఞాపకాలని నెమరు వేసుకోవడం –వృద్ధాప్యం వ్యసనం...

వెళ్లిపోయిన హితులూ, సన్నిహితులూ దిగులుగా జ్ఞాపకం వస్తారు. వృద్ధాప్యం ఒక వరమని, ఈ దేశపు వేదసంపద, సాంస్కృతిక వైభవం, జాతిదర్శనం, అపూర్వం, అనన్యసామాన్యం అని ఆవిష్కరిస్తారు రచయిత.

చివరలో...

చమకంలో 'వృద్ధం చమే' అనే ఒక్క కోరికా ఈ జాతినీ, మతాన్నీ, ఆలోచనా

స్రోతస్సునీ అత్యద్భుతంగా ఆవిష్కరించే అభిజ్ఞ. వరం. భగవంతుడిని కోరడంలోనే భగవంతుడు ప్రసాదించిన తన ఆలోచనా పరిణితిని అలంకరించే భగవద్దత్తమైన ఆశీర్వాదం. అదీ వృద్ధాప్యం అంటారు రచయిత.

ఇదీ వృద్ధాప్యానికి రచయిత పలికిన ముగింపు.

ఎంత చక్కటి ఆలోచన అనిపించింది చదవటం పూర్తి కాగానే.

వయస్సు మీదపడిన నాకు ఈ వ్యాసం చదవిన తర్వాత నా స్థితి రచయిత చెప్పిన దానికి భిన్నంగా లేదని అర్థం అయింది.

ఎందుకూ అంటే... భగవంతుడు ప్రాసాదించిన సుదీర్ఘ జీవితంలో నే కోల్పోయిన హితులూ, సన్నిహితులూ, బంధువులు, పగలూ, రాత్రి అదేపనిగా ఈ మధ్య తరచూ గురుకొస్తున్నారు. వ్యాసంలో రచయిత ప్రస్తావించినట్లుగా.

హఠాత్తుగా మా ఒంటిమామిడి అగ్రహారం జ్ఞాపకం వచ్చింది. అక్కడ నే గడిపిన బాల్యం, బ్రాహ్మణ్యం గుర్తుకువచ్చాయి. పెద్దలు మనసులో మెదిలారు. వారు అచరించిన సనాతన ధర్మజీవితం కళ్ళముందు కదిలింది. ఆ క్రమంలో సుబ్బారాయుడు తాతగారు గుర్తుకువచ్చారు. వారి గురించి కాస్త వివరం తెలుసు కుందామని మా తరంలోని అగ్రజుడు జెన్నీకి ఫోన్‌చేస్తే సోదరి మహాలక్ష్మి రిసీవ్ చేసుకుంది. కుశలం మాట్లాడిన తర్వాత నా అనుభవం చెబితే నవ్వింది.

సుబ్బారాయుడు...

ఈ పేరు సర్వసాధారణం మా కుటుంబాలలో. కాని మా సుబ్బారాయుడు తాతగారు అసాధారణమైన వ్యక్తి. నిరాడంబరులు.

వేదశాస్త్రాలలో చెప్పిన విధంగా సనాతనధర్మాన్ని తూచా పాటించి జీవితం సఫలం చేసుకున్న మహనీయులు. సుబ్బారాయుడుగారు సిరిసంపదల మీద ఏనాడూ ఆసక్తి చూపలేదు. ఆయన సిరి వేదం. సంపద కుటుంబం.

చిన్నతనంలనే సంస్కృతం అభ్యసించి పలు గ్రంథాలు ఔపోసన పట్టిన ఆయన, కుటుంబపెద్దల నుండి వేదశాస్త్రాలు నేర్చుకొని వేదం పరబ్రహ్మము అని గ్రహించి వేదశాస్త్ర నిష్ణాతులుగా పేరు గడించారు. నిత్యం త్రికాల సంధ్యా వందనం క్రమం తప్పనిసరి విధి. కుటుంబ దైవమైన శ్రీ విశ్వేశ్వరస్వామివారి



# 13. అందరికీ ఆరోగ్యం

సీతకి బ్రెయిన్ ట్యూమర్ అని డాక్టర్లు నిర్ధారించాక ముంబైలో హిందుజా హాస్పిటల్‌లో వైద్యంకోసం అత్యవసరంగా వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడటంతో మంచానికే పరిమితమైన అమ్మ విషయంలో ఏం చెయ్యాలా అని మదనపడుతూ ఉంటే రాధమ్మ "అమ్మని నే చూసుకుంటాను. నువ్వు నిశ్చింతగా ఉండు." అని భరోసా ఇవ్వడంతో అమ్మని హైదరాబాద్‌లో రాధమ్మ దగ్గర కొంతకాలం ఉంచక తప్పలేదు. ముంబై నుంచి వచ్చాక అమ్మని చూద్దామని హైదరాబాద్ వెళ్ళాను. నా రాక తెలిసి నాతో ఓ రెండు రోజులు గడపటానికి సికింద్రాబాద్ నుండి వచ్చింది మా రాజప్ప. అదనంగా మాతృసేవ కలిసి వస్తుందని. ఇంటిలోనికి రాగానే "జై గురుదేవ్" అంది రాజప్ప మావయ్య శ్రీరామకృష్ణని ఉద్దేశించి. ప్రతిగా "జై గురుదేవ్" అన్నాడు మావయ్య. పిచ్చాపాటీ మాట్లాడుకున్నాం సాయింత్రం వరకూ అందరమూ. ఆ తర్వాత స్నానాలు కానిచ్చి మరల సమావేశం అయ్యాం. మాటలలో యోగా, మెడిటేషన్, ఆర్ట్ అఫ్ లివింగ్ విషయాలు దొర్లాయి. ఆర్ట్ అఫ్ లివింగ్ ప్రస్తావన రాగానే రాజప్ప మొహంలో కళ, ఉత్సాహం వచ్చేశాయి. వెంటనే సమావేశం అయిన మా అందరినీ ఉద్దేశిస్తూ "మీకందరికీ ఆర్ట్ అఫ్ లివింగ్ ప్రాథమిక సూత్రాలు నేర్పుతాను ఈ రెండురోజులూ" అంది. ఆ మాట వినగానే మావయ్య మొహం వెలిగిపోయింది

చిచ్చుబుడ్డీలా. నేను మాత్రం డీలాపడ్డాను ఆ ప్రపోజల్ వినగానే. వెంటనే "నాకు కుదరదమ్మా! అసలే బి.పి., చక్కెర బీమారు నాకు. ఎటుపోయి ఏమి వస్తుందో?" అన్నా భయం భయంగా. "అబ్బే! అది ఏమీకాదు. నీ బి.పి., షుగరు ఇట్టే నయం అయిపోతాయి" అంది రాజప్ప రెట్టింపు ఉత్సాహంతో. "ససేమిరా కుదరదు" అన్నా ఖరాఖండిగా. "అయితే నీ ఖర్మ" అని మిగతా వారిని "మీ మాటేమిటి?" అని అడిగింది రాజప్ప. "మేము రెడీ" అని చేతులు ఎత్తి ఓటేశారు. రంగంసిద్ధం అయినందుకు రాజప్ప మనసు పూరీలా పొంగిపోయింది. నియమనిబద్ధతలు గల ఆణిముత్యాలులాంటి ఆరుగురు శిష్యులు దొరికిపోయారు గురువుగారికి సునాయాసంగా. ఈ శిష్యపరమాణవులను పరిచయం చేయడం నా కనీస కర్తవ్యం మరియు ధర్మం కూడానూ. ఇదిగో వారే వీరు.

## ప్రథమం:

మావయ్య. శ్రీరామకృష్ణ. రాధమ్మ భర్త, నాకు బావ. "ఆచార్య దేవో భవః" అన్న సూక్తి మనసావాచా జీర్ణంచేసుకున్న సీనియర్ సిటిజన్. సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగంచేసి రిటైర్ అయిన తర్వాత ఎక్కువ సమయం ఆధ్యాత్మిక చింతనతో కాలంగడుపుతూ "దేహి" అని ఆశ్రయించిన వారికి శాయశక్తులా సహాయంచేసే మనసున్న వ్యక్తి. రోజు విడిచి రోజు అవసరం ఉన్నా లేకపోయినా ఎండలో పడి సి.జి.హెచ్.ఎస్. (CGHS) హాస్పిటల్‌కి వెళ్లి మందులు, విటమిన్లు ప్రోగుచేసుకోవటం ప్రత్యేకత. మందులు టైంకి వేసుకోకపోవడం అదనపు ప్రత్యేకత. భోళామనిషి. ఎవరు ఏమి చెప్పినా, చెయ్యమన్నా ఖండించని వ్యక్తిత్వం.

## ద్వితీయం

రాధమ్మ. నాకు, రాజప్పకి తోబుట్టువు. పదిహేను సంవత్సరాలకే ఝుమ్మని మెళ్ళో పుస్తెకట్టించేసుకొని అత్తగారులేని గంపెడంత సంసారాన్ని అవలీలగా గట్టు ఎక్కించిన ధీర మహిళ. ఇంటికి వచ్చిన అతిథులను హాలులో కూర్చోబెట్టి కబుర్లుచెబుతూ మధ్యలో వంటింటిలో పంచభక్ష్య భోజనం సిద్దంచేసి "వడ్డించేశా! రండి" అని ధీమాగా ఆహ్వానించే పనిమంతురాలు. త్యాగాలు చెయ్యటం రాధమ్మ ప్రత్యేకత. ఈవిడ కనుమరుగు అవ్వగానే "త్యాగరాజస్వామివారు" అని బాగా

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Agraharam+Kathalu+Jagatpati+Yerramilli**

* * *